
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 44.5 ; కనిష్ఠం 31.6


16 నుంచి బాల సంస్కార శిబిరం

సదాశివనగర్, మే 5: సదాశివనగర్ మండలం లింగంపల్లి శ్రీకృష్ణమందిరం వద్ద మహానుభావ దీనబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి వారం రోజుల పాటు బాల సంస్కార శిబిరం నిర్వహించడం జరుగుతుందని పీఠాధిపతులు మహంతి శ్రీ మచాలే బాబా, మహంత్ శ్రీ కన్హేరాజ్ బాబా తెలిపారు. నాల్గోవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బాలబాలికలు ఈ శిబిరంలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. చిన్నారుల్లో జీవితానికి కావాల్సిన మార్గదర్శకాలు ఈ బాల సంస్కార శిబిరంలో అందించడం జరుగుతుందన్నారు.



లింగాయత్, ముస్లిం, మున్నూరుకాపుల

ఓట్లు ఎటువైపో?



- జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్‌లో లింగాయత్, ముస్లింలు, మున్నూరుకాపుల ఓట్లే కీలకం
- ఆ వర్గాల ఓట్లపై గురిపెట్టిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఆ ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు
- లింగాయత్‌ల ఓట్లు 2.56 లక్షలు
- ముస్లింల ఓట్లు 2.30 లక్షలు
- మున్నూరు కాపుల ఓట్లు సుమారు 2లక్షలు
- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 16.40 లక్షల ఓట్లు

కామారెడ్డి, మే 5(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థుల గెలుపోటములను ఆ మూడు వర్గాల ప్రజల ఓట్లే తేల్చనున్నాయి. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో లింగాయత్, ముస్లింలు, మున్నూరుకాపు ఓట్లు సుమారు 6 లక్షలకు పైగా ఉన్నాయి. ఈ మూడు వర్గాల వారు ఎవరికి మద్దతు పలికితే వారి గెలుపు కాయం కానుందని రాజకీయ విశ్లేషకులు వాపోతున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఎంపీ అభ్యర్థులు సైతం ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారే కావడం విశేషం. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆ వర్గాల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. లింగాయత్, ముస్లింలు, మున్నూరుకాపుల ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ మూడు వర్గాలకు సంబంధించిన ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక హామీలు కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌లు లింగాయత్ సామాజికవర్గ వ్యక్తులు కావడంతో ఆ ఓట్లు కలిసొచ్చే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు ముస్లింల ఓట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయంటూ ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ దీమాతో ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆ వర్గం ఓట్లు తనకే పడతాయని బీఆర్ఎస్ పాలనలో మైనార్టీలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తనకు లబ్ధి చేకూరుస్తాయని ఆ పార్టీ వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. ఈ మూడు వర్గాల ఓట్లను సాధించాలనే ఆలోచనలో ఈ పార్టీ అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది.

పార్లమెంట్ పరిధిలో 16.40 లక్షల ఓట్లు

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మూడు రోజుల క్రితం ఎన్నికల కమిషన్ తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,40,755 ఓట్లు ఉండగా ఇందులో మహిళలవి 8,39,133, పురుషులవి 8,01,563, ఇతరులవి 59 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,54,626 ఉండగా ఇందులో మహిళలవి 1,32,301, పురుషులవి 1,22,306, థర్డ్ జండర్‌వి 19 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,23,009 ఉండగా ఇందులో మహిళలవి 1,16,131, పురుషులవి 1,06,876, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,02,769 ఉండగా ఇందులో మహిళలవి 1,03,286, పురుషులవి 99,474, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 1,96,691 ఉండగా ఇందులో మహిళలవి 1,02,990, పురుషులవి 93,688, థర్డ్ జండర్‌వి 13 ఓట్లు ఉన్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,75,562 ఉండగా ఇందులో మహిళలవి 1,37,866, పురుషులవి 1,37,694, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు ఉన్నాయి. ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,50,857 ఉండగా ఇందులో మహిళలవి 1,28,186, పురుషులవి 1,22,666, థర్డ్ జండర్‌వి 5 ఓట్లు ఉన్నాయి. నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓట్లు 2,37,241 ఉండగా ఇందులో మహిళలవి 1,18,373, పురుషులవి 1,18,859, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి.

లింగాయత్, ముస్లింలు, మున్నూరుకాపు ఓట్లే కీలకం

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో లింగాయత్ ముస్లింలు, మున్నూరుకాపు ఓట్లే కీలకం కానున్నాయి. దాదాపు 16 లక్షల ఓటర్లలో లింగాయత్‌ల ఓట్లు 2.56 లక్షలు ఉన్నాయి. లింగాయత్‌లు ఎక్కువగా జహీరాబాద్, నారాయణఖేడ్, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్నారు. ముస్లింల ఓట్ల సంఖ్య 2.30 లక్షలు ఉన్నాయి. వీరంతా జహీరాబాద్, కామారెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్నారు. మున్నూరుకాపుల ఓట్ల సంఖ్య సుమారు 2లక్షల వరకు ఉన్నాయి. వీరంతా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ప్రతీ ఎన్నికల్లోను వీరి ఓట్లే కీలకమవుతూ వస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ ఏర్పడింది. మొదటి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపొందారు. సురేష్ షెట్కార్‌కు కాంగ్రెస్ పార్టీ తరుపున ముస్లింల ఓట్లు కలిసిరావడం, ఆయన సామాజిక ఓట్లు ఎక్కువగా పడటంతో గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ బీబీ పాటిల్‌ను బరిలో నిలిపింది. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో లింగాయత్‌ల ఓట్లు అధికంగా ఉండటంతో పాటిల్‌కు రెండు సార్లు కలిసి వచ్చింది. దీంతో గత ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో లింగాయత్, ముస్లింలు, మున్నూరుకాపు ఓట్లు ఏ పార్టీ వైపు, ఏ అభ్యర్థి వైపు ఉన్నారో పోలింగ్ వరకు వేచి చూడాలి.

పాటిల్‌కు లింగాయత్ ఓట్లు కలిసే వచ్చే అవకాశం

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన వారివే ఉన్నాయి. సుమారు 2.56 లక్షల ఓట్లు లింగాయత్‌లవే ఉండటం విశేషం. ఈసారి బీజేపీ తరఫున బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు లింగాయత్ ఓట్లు కలిసి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పాటిల్ లింగాయత్ సామాజిక వర్గానికి చెందడం ఆయనకు కలిసి రానుంది. గత ఎన్నికల్లో పాటిల్ విజయానికి లింగాయత్ ఓట్లే కీలకం అయ్యాయి. ప్రస్తుతం లింగాయత్ సామాజిక వర్గంలో రెండు వర్గాలు చీలిపోయినట్లు సమాచారం. ఓ వర్గానికి చెందిన వారు మాత్రమే పాటిల్‌కు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరో వర్గాన్ని అనుకూలంగా మార్చుకునేందుకు పాటిల్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ ఎన్నికల్లో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని తమ సామాజిక వర్గం వాడినేనంటూ స్థానిక సెంటిమెంట్‌ను ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా మోదీ చరిష్మ, బీజేపీ ప్రభుత్వ పాలన, చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఒక వైపు, మిగితా సామాజిక వర్గాల ఓట్లు తమ వైపు ఉంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మూడు వర్గాల వారు ఏ విధంగా కలిసివస్తాయో చూడాలి.

షెట్కార్‌కు కలిసిరానున్న ముస్లిం, లింగాయత్ ఓటు బ్యాంక్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న సురేష్ షెట్కార్‌కు ముస్లిం ఓట్లతో పాటు లింగాయత్‌ల ఓట్లు సైతం కలిసివచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సురేష్ షెట్కార్ గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఒకసారి గెలుపొందగా మరోసారి ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ముస్లింల ఓటు బ్యాంక్ ఖచ్చితంగా ఉంటుంది. జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో సుమారు 2.30 లక్షల ముస్లింల ఓట్లు ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఓట్లు జహీరాబాద్, బాన్సువాడ, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ప్రస్తుతం మంచి పట్టు ఉంది. ఈ నేపథ్యంలో ముస్లింల ఓట్లు తనకే పడుతాయంటు సురేష్ షెట్కార్, కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు. ఇక లింగాయత్‌లు రెండు వర్గాలు చిలిపోవడం ఓ వర్గం వారే పాటిల్‌కు అనుకూలంగా ఉండటంతో వ్యతిరేఖ వర్గా న్ని కాంగ్రెస్ మచ్చిక చేసుకునే ప్రయత్నంలో పడింది. ఇలా ముస్లింలు, లింగాయత్‌ల ఓట్లను సాధిస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ శ్రేణులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మున్నూరుకాపు, ముస్లింల ఓట్లపైనే గాలి ఆశలు

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను నిలపడంతో ఆ వర్గం ఓట్లు చీలిపోతాయని బీఆర్ఎస్ మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను బరిలో దింపింది. లోక్‌సభ పరిధిలో మున్నూరుకాపు ఓట్లు సైతం ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గాలి అనిల్‌కుమార్ మున్నూరుకాపు ఓట్లతో పాటు ముస్లింల ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. మున్నూరుకాపు ఓట్లు సుమారు 2లక్షల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. ముస్లింల ఓట్లు 2.30లక్షలు ఉన్నాయి. మున్నూరుకాపు ఓట్లతో పాటు మైనార్టీ ఓట్లను ఆకర్షించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పాలనలో మైనార్టీలకు చేపట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ రెండు వర్గాలతో పాటు మిగితా వర్గాల ఓట్లను సాధిస్తే గెలువడం సునాయసమేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. బీఆర్ఎస్ ఈ వర్గాల ఓట్లు ఏ స్థాయిలో అనుకూలిస్తాయో పోలింగ్ రోజు తేలనుంది.

10న ప్రియాంక గాంధీ పబ్లిక్ మీటింగ్



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్

కామారెడ్డి టౌన్, మే 5: కామారెడ్డిలో ఈనెల 10న ప్రియాంక గాంధీ పబ్లిక్ మీటింగ్ ఉంటుందని ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్ తెలిపారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియాంక గాంధీ సభను నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని మాయమాటలతో మభ్యపెట్టే బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నరేంద్రమోదీ ప్రతీ సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో యువకులు తెలుసుకోవాలని అన్నారు. దళితులు, బలహీన వర్గాల, గిరిజనులు ఆలోచించాలని అన్నారు. రిజర్వేషన్లు తొలగిస్తామన్న మోదీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. అనంతరం షబ్బీర్‌అలీ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. అందరికి అందుబాటులో ఉండే సురేష్‌షెట్కార్‌ను గెలిపించుకుంటునే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆడ బిడ్డలపై భారం పడకుండా రూ.500లకే సిలిండర్ అందిస్తున్నామని, ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. 10న ప్రియాంకగాంధీ బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న అధికారులు

కామారెడ్డి టౌన్, మే 5: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలీసు అధికారులు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఆదివారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు పెసిలిటేషన్ సెంటర్‌లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. జిల్లాలో 4,546 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలీసు అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకొనుటకు వీలుగా ప్రతీ నియోజకవర్గంలో ఒక ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా శని, ఆదివారాలలో పీఓలు, పోలీసు అధికారులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇతర పోలింగ్ సిబ్బంది మాత్రం సోమ, మంగళవారాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ఆయా నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. అదేవిధంగా వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పట్టణంలోని నర్సనపల్లిలో వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు.

హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న ఓటర్లు

పెద్ద కొడప్‌గల్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయని వారి కోసం ప్రభుత్వం హోం ఓటింగ్‌ను తీసుకువచ్చారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయని వారి వివరాలు నమోదు అయి ఉండటంతో, అటువంటివారి దగ్గరికి వెళ్లి ఓటు వేయిస్తున్నారు. శనివారం హోం ఓటింగ్‌ను నిర్వహించిన అధికారులు ఆదివారం కూడా హోం ఓటింగ్‌ను నిర్వహించారు. దీంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లని వారు తమ ఇళ్ల వద్ద ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

ఓటింగ్ శాతం పెంపునకు అధికారులు కృషి చేయాలి



పోలింగ్ బూత్ వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 5: ఓటింగ్ శాతం పెంపునకు అధికారులు కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్ జీ తివారి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆదర్శనగర్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా జరిగే విధంగా ఎన్నికల అధికారులు చూడాలని తెలిపారు. జిల్లాలో 6,80,921 మంది ఓటర్లు ఉన్నారని వారి కోసం 913పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటువేసే అవకాశం కల్పిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఆర్డీవో రఘునాథరావు, నోడల్ అధికారి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను జహీరాబాద్ పార్లమెంట్ సాధారణ పరిశీలకుడు గోపాల్‌జీ తివారితో కలిసి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. వారితో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మన్య ప్రభాకర్, నోడల్ అధికారి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ఆర్టీఏ చెక్ పాయింట్

- అక్కడ అంతా షరా మామూలే
- ప్రైవేటు వ్యక్తులను నియమించుకుంటూ సిబ్బంది ఇష్టారాజ్యం
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- పని చేయని సీసీ కెమెరాలు.. భిక్కనూరు పోలీసుల నోటీసులు
- ఇప్పటి వరకు ఏడుగురి మృతి



జంగంపల్లిలో ఉన్న ఆర్టీఏ చెక్ పాయింట్



పని చేయని సీసీ కెమెరా

భిక్కనూరు, మే 5: వాహనాలకు సంబంధించి పర్మిట్, అన్ని కాగితాలు ఉన్నా అక్కడ డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే అక్కడి నుంచి వాహనం జరగడం పక్కనబెడితే సదరు వాహనదారుడు చాలా ఇబ్బందులు పడాల్సిందే. అదే భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీఏ చెక్‌పాయింట్ వద్ద జరుగుతున్న తీరు. అది పేరుకే చెక్ పాయింట్, కానీ అక్కడ అంతా షరా మామూలే. అక్కడా ఏసీబీ దాడులు జరిగినా అధికారుల తీరులో మాత్రం మార్పు కనిపంచడం లేదు. నిత్యం వాహనాలతో కిటకిటలాడే ఈ చెక్ పాయింట్‌లు ప్రస్తుతం ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఈ చెక్ పాయింట్‌లలో వాహనదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న ఇంట్రెస్ట్ ఇక్కడ నెలకొన్న సమస్యలను మాత్రం పరిష్కరించడంలో అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెక్ పాయింట్‌ల వద్ద రోడ్లపై నిత్యం ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడం, ఇక్కడ వాహనాలను ఆపేందుకు ఆర్టీఏ సిబ్బంది నియమించుకున్న ప్రైవేటు సిబ్బంది రోడ్డుపై అటు, ఇటుగా తిరుగుతుండటంతో పాటుగా వాహనాల డ్రైవర్లు రోడ్డు దాటుతున్న సమయంలో ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ ఒక చెక్‌పాయింట్ మాత్రమే ఉండగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రమాదాలను నివారించేందుకు కొన్ని రోజులు క్రితం రెండవ చెక్‌పాయింట్‌ను ఏర్పాటు చేసి ఇరువైపులా ప్రత్యేకంగా రోడ్డు వేయించారు. అయినా రోడ్డు బాగా ఇరుకుగా ఉండటంతో పెద్దపెద్ద వాహనాలు నిలపడానికి ఇబ్బందిగా మారుతోంది.

ప్రైవేటు వ్యక్తుల నియామకం

ఆర్టీఏ చెక్ పాయింట్‌లో ప్రతీరోజు ఎనిమిది నుంచి పది మంది వరకు ప్రైవేటు వ్యక్తులు విధులు నిర్వహిస్తుంటారు. చెక్ పాయింట్‌లో విధులు నిర్వహించే ప్రతీ అధికారి వీరిని నియమించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీరిలో చెక్ పాయింట్-1 వైపు ముగ్గురు, చెక్ పాయింట్-2 వైపు ముగ్గురు వాహనాలను ఆపేందుకు, చెక్ పాయింట్‌ల లోపల ఇద్దరిని, మరికొందరిని ఇతరితర పనులకు ఏ రోజుకి ఆ రోజు విధుల్లో ఉండే అధికారి ఉపయోగించుకుంటున్నట్లు సమాచారం. ఇందుకు వీరు ఉదయం 8 గంటలకు విధుల్లోకి వస్తే తిరిగి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు (24 గంటల డ్యూటీ) తిరిగి ఇంటికి వెళ్తారు. ఇందుకు (అనధికారిక) డ్యూటీ చేసిన వారికి సదరు అధికారి రూ.2వేల నుంచి రూ.2500ల వరకు అందజేస్తున్నట్లు వినికిడి. కాగా తమ వద్ద పర్మిట్, ఇతరితర అన్ని కాగితాలు ఉన్న అధికారులు తమ వద్ద నుంచి రూ.200 నుంచి రూ.500ల వరకు వసూళ్లు చేస్తున్నారని, ఎందుకని ప్రశ్నిస్తే కాగితాలను వెంట ఉంచుకుని వాహనాలు వెళ్లకుండా చేస్తున్నారని ఇతర రాష్ట్రాల వాహనదారులు 'ఆంధ్రజ్యోతి'తో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఈ చెక్ పాయింట్‌లో వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన సంఘటనలు ఉన్నాయి.

పని చేయని సీసీ కెమెరాలు.. పోలీసుల నోటీసులు..

నిత్యం వాహనాలతో కిటకిటలాడే ఈ ఆర్టీఏ చెక్ పాయింట్‌లోని సీసీ కెమెరాలు పని చేయడం మానేశాయి. చెక్ పాయింట్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నా అధికారులు వాటిని బాగు చేయించడం లేదు. ఏదో గోడకు సీసీ కెమెరాలు ఉన్నాయంటే ఉన్నట్లు ఉంది. ఎవరైనా అడిగితే మాత్రం సీసీ కెమెరాలు పని చేస్తున్నట్లుగానే సిబ్బంది చెబుతున్న పరిస్థితి. ఇటీవల చెక్‌పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైనా వాహనాన్ని గుర్తించడానికి భిక్కనూరు పోలీసులు పరిశీలించగా అవి పని చేయడం లేదు. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. ఎందుకు పని చేయడం లేదని పోలీసులు అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా ఇటీవల కురిసిన వర్షానికి చెడిపోయాయని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో భిక్కనూరు పోలీసులు సీసీ కెమెరాలు పని చేయకపోవడం పట్ల చెక్ పాయింట్ అధికారికి నోటీసులు జారీ చేశారు. కాగా వాహనదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు ఉండకూడదనే సీసీ కెమెరాలను పట్టించుకోవడం లేని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్న పరిస్థితి ఉంది.

వాహనాన్ని పట్టుకోవడంలో పోలీసులకు ఇబ్బందులు

ఇటీవల ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఎవరు చూడకపోవడం, ఆర్టీఏ చెక్ పాయింట్‌ల వద్ద సీసీ కెమెరాలు పని చేయక పోవడంతో పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు రెండు బృందాల పోలీసులు పని చేస్తుండగా, భిక్కనూరు టోల్‌గేట్, తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ చెక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు పని చేసి ఉంటే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడం సులువయ్యేదని పోలీసుల మాట. అయినా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు ఏడుగురు మృతి, 9 మందికి గాయాలు

జంగంపల్లి ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018 నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 17 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా గత గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం మాత్రం అత్యంత ఘోరమైంది. ఈ ప్రమాదంలో వెంకట్ శరీరం ఛిద్రమైంది. పోలీసులు ఈ ఛిద్రమైన మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. రోడ్డు ప్రమాదంలో వెంకట్ మృతి చెందగా అదిచూసి అప్పటికే ఆయనతో పని చేస్తున్న ప్రైవేటు సిబ్బంది భయపడి పారిపోగా కార్యాలయ సిబ్బంది పోలీసులు వచ్చే వరకు మృతదేహం వద్ద ఎవరు వెళ్లలేదని, పోలీసులకు సమాచారం అందగానే ఎస్సై సాయికుమార్ వెంటనే చేరుకున్నట్లు సమాచారం. పోలీసుల రికార్డుల ప్రకారం 17 ప్రమాదాలు జరుగగా పోలీసుల దృష్టికి రాని ప్రమాదాలు చాలానే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో సైతం పలువురు గాయపడి వికలాంగులుగా మారిన సంఘటనలు ఉన్నాయి.

సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నోటీసులు ఇచ్చాం

● సాయికుమార్, ఎస్సై, భిక్కనూరు.

జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇటీవల ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీఏ చెక్ పాయింట్‌లో పని చేసి ఒకరు మృతి చెందగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడానికి చెక్ పాయింట్ సీసీ కెమెరాలను పరిశీలించగా అవి నిరుపయోగంగా ఉన్నాయి.

బీబీ పాటిల్‌కు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలి : ఎమ్మెల్యే కాటిపల్లి

కామారెడ్డిటౌన్, మే 5: జహీరాబాద్ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చే నాయకులు, కార్యకర్తలు కృషిచ ఏయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి పట్టణంలోని ప్రతి ఇంటికి కార్యకర్తలు, నాయకులు వెళ్లి ప్రధీని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన పథకాలు, అభివృద్ధి పనులను వివరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏవిధంగా పనిచేశారో అదే విధంగా పనిచేసి బీబీ పాటీల్‌కు అంతకంటే ఎక్కువ మెజార్టీ తీసుకువచ్చేలా చూడాలన్నారు. గతకొంతకాలంగా కామారెడ్డిలో వ్యాపారులను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయ్యడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, భరత్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఒప్పందంతో సజ్జ సాగు

● క్వింటాలుకు రూ.7600 విక్రయించేలా ఒప్పందం

డొంకేశ్వర్, మే 5: యాసంగి సీజన్‌లు మండలంలో చాలా గ్రామాల్లో నువ్వుల పంటకు బదులుగా సజ్జ సాగు చేస్తు రైతులకు మంచి ఆదాయం పొందుతున్నారు. సజ్జపంటకు విక్రయించేందుకు నేరుగా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వేసంగి సీజన్‌లో మండలంలో అనువైన వాతావరణం పరిస్థితులు ఉండడంతో సజ్జను రైతులకు అందించడానికి పలు కార్పోరేట్ కంపెనీలు ఇక్కడే రైతుల చేతి ఉత్పత్తి చేయిస్తున్నాయి.

● ధర ఆశాజనకంగా ఉండడంతో..

సజ్జ సాగు చేసిన రైతులకు ప్రైవేటు కంపెనీలు క్వింటాలుకు రూ.7600 వరకు ఇస్తున్నాయి. కంపెనీ విత్తనాలు ఇవ్వడం పంటలు పండిన తర్వాత బైబ్యాక్ పద్దతిలో ఆ పంటను కొనుగోలు చేయడం రైతులకు కలిసి వస్తుంది. జిల్లాలో అనువైన వాతావరణం ఉండడంతో ప్రైవేటు కంపెనీలు ఇప్పటి వరకు వరి, జొన్నలు విత్తనం ఉత్పత్తి చేయగా తాజాగా సజ్జలు సాగు చేస్తున్నాయి. అలాగే రైతులు ఎక్కువగా సాగు చేసే వరి, పసుపు వంటి పంటలకు ప్రభుత్వ మద్దతు ధర ఉండగా మిగతా వాటికి లేదు. దీంతో రైతులు ఎదైనా కొత్త పంట సాగు చేస్తే మార్కెట్ వచ్చే సరికి ఏ ధర ఉండడంతో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ముందే ఫలానా ధర చెల్లిస్తామని కంపెనీలు ముందకు రావడంతో రైతులు సజ్జ వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికి తోడు తోడు తక్కువ కాలంలో పెద్దగా ఖర్చు లేకుండా పంట చేతికి అందుతుండడంతో ఈ పంట వైపు దృష్టి పెడుతున్నారు.

రేటు బాగా ఉందని వేశాను

: మోర్తాడ్ రవి, రైతు, నూత్‌పల్లి



సజ్జ రేటు బాగా ఉందని నువ్వుకు బదులు రెండు ఎకరాలు సజ్జ పంట వేశాను. కంపెనీ వాళ్లు ఇచ్చిన విత్తనాలు పంట ప్రారంభం నుంచి సరిగ్గా ఎదగలే దీంతో కంకి ఆశించిన స్థాయిలో రాలేదు. కంపెనీ వారు ఒప్పందం ఇచ్చిన ప్రకారం దిగుబడి వచ్చే అవకాశం లేదు.



● డొంకేశ్వర్ మండంలోని గ్రామాల్లో సాగు చేస్తున్న సజ్జ పంట

● 1200 ఎకరాల్లో..

మండలంలో డొంకేశ్వర్, నూత్‌పల్లి, మారంపల్లి, గాదేపల్లి ప్రాంతాల్లో ఎక్కువగా మొత్తం 1200 ఎకరాల్లో రైతులు బైక్ బ్యాక్ పద్దతిన సజ్జను సాగు చేశారు. మక్క, జొన్న పంటలు చేస్తే అడవి పందులు, రామచిలుకలు, కోతులు పంటలను తీవ్ర నష్టం చేయిస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయ పంటగా రైతులు సజ్జ సాగు చేస్తున్నారు. ఐదు నుంచి ఆరు సార్లు నీటి తడులు అందిస్తే సరిపోతుండడం పెద్దగా ఎరువులు వేసే అవకాశం లేకపోవడంతో పాటు పంట 85నుంచి 90రోజుల్లో చేతికి వస్తుంది. మండలంలో సజజ పంట కోతలు మొదలయ్యాయి.

ప్రారంభం ఉంచి సజ్జకు తెగులు

సజ్జ పంట సాగు చేసిన రైతులకు కత్తెర పురుగు సజ్జ పంటకు ఆశించి పంటకు నష్టం చేసింది. దీంతో రైతులు ఒకటి నుంచి నాలుగు సార్లు మందులను స్ప్రే చేశారు. అయిన పురుగు ఉధృతికి అదుపులోకి రాకపోవడంతో దిగుబడి మీద ప్రభావం ఏర్పడింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

● ఎకరాకు కిలో విత్తనం

ప్రైవేటు కంపెనీలే విత్తనాలు కిలోకకు రూ.800చొప్పున సరఫరా చేస్తున్నాయి. ఎకరాకు కిలో విత్తనాలు అవసరమవుతున్నాయి. ఆడ, మాగ విత్తనాలు ఇస్తారు. ఇవత్తనాలు ఉత్పత్తి కింద సాగు చేసిన రకాల్లో ఎకరాకు పది నుంచి 14క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. మంచి దిగుబడి వస్తే ఎకరాకు రూ.80వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇక్కడే పంటను సీజ్ కంపెనీలు పంజాబ్, హార్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి. ఏదైనా గ్రామంలో 50శాతం మంది రైతులకు పది క్వింటాళ్ళ కంటే తక్కువ దిగుబడి పది క్వింటళ్లు వస్తే రేటు చెల్లిస్తారు. అంతకంటే ఎక్కువ దిగుబడి వస్తే ఆ మేరకు ధర చెల్లిస్తారు.

హరితలో అసలేం జరుగుతోంది?

● గాడి తప్పిన నిర్వహణ ● దోచుకున్నోళ్లకు.. దోచుకున్నంత ● 'హరిత'కు వెళ్లేందుకు మొహం చాటేస్తున్న పర్యాటకులు
● వేతనాల కోసం అడ్డదారుల్లో 'హరిత' నిర్వహణ ● ఐఏస్ స్థాయి అధికారి ఆకస్మిక తనిఖీలకు పర్యాటకుల డిమాండ్



● అలీసాగర్‌లోని హరిత రెస్టారెంటు దృశ్యం

ఎడపల్లి, మే 5: పచ్చని ప్రకృతి పర్యావరణంలో పర్యాటకుల విడిది కోసం కోట్లు వెచ్చించి నిర్మించిన అతిథి భవనం అధ్వాన్నంగా మారింది. అక్కడ పని చేస్తున్న సిబ్బంది వేతనాల వసూళ్ళే లక్ష్యంగా అడ్డదారులు తొక్కుతూ నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఈ హరిత రెస్టారెంటుకు వచ్చే పర్యాటకులు అక్కడ జరుగుతున్న వివిధ----కార్యకలాపాలను చూసి నోరు వెళ్ళ బోసుకుంటున్నారు. దీంతో ఈ హరిత హోటల్ పర్యాటకుల విడిది గదుల నిర్వహణ తీరుపై స్థానికంగా ప్రజలు హరితలో అసలేం జరుగుతందోనని పలు రకాలుగా చెడు భావనతో చర్చించుకుంటున్నారు.

● గాడి తప్పిన నిర్వహణ

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 15 కిలో మీటర్ల దూరంలో అందమైన అడవుల మధ్య అలీసాగర్ రిజర్వాయర్ పైన సుమారు రెండున్నర కోట్లతో గత పదేళ్ళ క్రితం తెలంగాణ పర్యాటక శాఖ 14 గదులతో పర్యాటకుల విడిది భవనం, వారికి బోజన వసతి కోసం రెస్టారెంటును నిర్మించింది. అయితే కొత్త మోజులో కొంత కాలంగా రెస్టారెంటును, గదుల నిర్వహణను సక్రంగా సాఫీగా సాగించిన అక్కడ పనిచేసే సిబ్బందికి వేతనాలు కావలసినంత రాకపోవడంతో నిర్వహణ గాడి తప్పింది. గత మూడేళ్లుగా ఎంతగా వాటి నిర్వహణ దిగజారిందో స్థానికుల గుసగుసలే ఇందుకు నిదర్శనం.

● దోచుకునోనళ్లకు.. దోచుక్నుంత

అలీసాగర్ ఉద్యాన వనానికి వచ్చే పర్యాటకులు కాసేపు విశ్రాంతి తీసుకుని సేద తీరాలనే ఉత్సాహంతో వచ్చే పర్యాటకుల నుండి స్థానికంగా హరిత హోటల్‌లో పనిచేసే నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు, వారికి అంతజేస్తున్న మౌళిక వసతులు సక్రమంగా లేకపోవడంతో పర్యాటకులపై తీవ్ర భారం పడుతూ జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి. అంతే కాకుండా అదిక డబ్బులు వసూలు చేస్తూ పర్యాటకుల నుండి అందిన కాడికి దోచుకోవడం ఇక్కడ పనిచేసే నిర్వాహకుల వంతయింది.

● మొహం చాటేస్తున్న పర్యాటకులు

గత పదేళ్ళ క్రితం నూతన హంగులు, ఆర్భాటాలతో అన్ని రకాల మౌళిక వసతుల కల్పనతో ప్రారంభం అయిన ఈ హరిత హోటల్ నిర్వహణలో పర్యాటకులకు కొన్ని గదుల్లో ఏసీలు, గీజర్లు పనిచేయకపోవం, విద్యుత్ సౌకర్యం, టి.వీ సౌకర్యం లేక పోవడం, కిటికీలు, తలుపులు, మూత్రశాలల అన్ని రకాల పరికరాలు సక్రమంగా పనిచేయకపోవడం, మరి కొన్ని గదుల్లో ధ్వంసం అయిన అద్దాలు, పగిలిన బండరాళ్ళు కనిపించడం, ఈ గదులలో సరిపడా కావలసిన బట్టలు లేకపోవడం, సర్వీస్ సిబ్బందిని తగినంత నియమించక పోవడం, త్రాగు నీటికి ప్రాముఖ్యత ఇవ్వక పోవడం, అస్తవ్యస్తమయిన విద్యుత్ పరికరాలు ఉండడం, వీధి దీపాలు వెలగకపోవడం, పర్యాటకులు వచ్చి వెళ్లేందుకు సూచిక బోర్డులు లేకపోవడం, జానకంపేట-మోస్రా రోడ్డులోని ఠాణాకలాన్ నుండి హరిత హోటల్‌కు వెళ్లే రోడ్డు మార్గం 2 కిలో మీటర్ల మేర పూర్తిగా శిథిలావస్థకు చేరడం, అక్కడికి వచ్చే పర్యాటకులకు రక్షణ పరమైన చర్యలు చేపట్టక పోవడంతో పర్యాటకులు అక్కడకి వచ్చేందుకు మొహం చాటేస్తున్నారు. ఇదే అదనుగా అక్కడ పని చేసే సిబ్బంది ఎలాగైనా వేతనాలు రాబట్టాలనే కాంక్షతో నిర్వాహకులు అక్రమ మార్గాలను ఎంచుకుని మూడు పవ్వులు ఆరు కాయలుగా గోప్యంగా నిర్వహణ కొనసాగిస్తున్నారు.

● తనిఖీలు ఉట్టి మాటే..

ప్రతీనెలా తెలంగాణ పర్యాటక శాఖ, విజిలెన్సు విభాగం అధికారులు అకస్మిక తనిఖీ చేపడతారని అక్కడి సిబ్బంది చెబుతున్నప్పటికీ ఇదంతా వట్టి మాటే అన్నట్లుగా తెలుస్తుంది. ఎందుకంటే హరిత అతిథి గృహంలో గదుల నిర్వహణలో ఉదయం ఒక వ్యక్తి తన ఆధార్‌కార్డు ఇచ్చి పేరు నమోదు చేసుకుంటే తన పేరుమీద మరుసటి రోజు ఉదయం వరకు 24 గంటలు ఆ గది బుకింగ్ అవుతుంది. ఇక్కడే అసలుకథ మొదలవుతుంది. ఆ వ్యక్తి పేరు మీద గది బుక్ అయిన కొన్ని గంట్లో అతను వెల్లిపోయాక ఆ గదికి మరో వ్యక్తి వస్తే మరో వ్యక్తి పేరు నమోదు చేసి గది ఇవ్వాల్సి ఉండగా అలాంటివి జరుగకుండా మొదటి వ్యక్తి పేరు మీదనే గదిని కొనసాగిస్తూ తర్వాత వచ్చిన వారి నుండి డబ్బులు వసూలు చేసి కాజేయడం ఇక్కడి నిర్వాహకులకు పరిపాటిగా మారింది. దీనితో పాటు నిబంధనలు గాలికి వదిలేసి మైనర్ ప్రేమ జంటలకు సైతం గదులను అద్దెకు ఇస్తున్నట్లు ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఇదంతా నిర్వాహకులు అందరూ కుమ్మక్కై మూడూ పువ్వులు ఆరు కాయలుగా తతంగం నడిపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● అంతా నా ఇష్టం!!

అలీసాగర్ హరిత హోటల్ నిర్వహణలో సహాయ మేనేజరుగా ప్రస్తుతం పని చేస్తున్న ఆ వ్యక్తి గత ప్రభుత్వ పాలకులలో ముఖ్యమంత్రి సామాజిక కులానికి చెందిన వ్యక్తినని, తన బంధువు రాష్ట్ర పర్యాటక శాఖలో ఎండీగా ఉన్నాడని, తాను చెప్పిందే శాసనంగా అందరూ భావించి నడుచుకోవాలని లేదంటే పని ఒత్తిడులు, ఇబ్బందులు, పనిలోంచి తొలడించడం తప్పవని హెచ్చరికపు మాటలతో సిబ్బంది నుంచి పని చేయించుకోవడం పరిపాటిగా మారింది. ఇది ఇలా ఉంటే హరిత హోటల్‌ను హైదరాబాదుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ ఇక్కడ పని చేస్తున్న సహాయ మేనేజర్‌కు ఉన్న పరిచయాలతో ఇద్దరు కలిసి పెట్టుబడి పెట్టి ఫొటో షూట్ కోసం దాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దారు.

● ఆకస్మిక తనిఖీలతో అసలు గుట్టు రట్టు

తెలంగాణ పర్యాటక శాఖ రాష్ట్రస్థాయిలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ స్థాయి ఉన్నతాధికారులు అకస్మికంగా నిజామాబాద్ జిల్లాలోని హరిత హోటల్ నిర్వహణపై తనిఖీలు చేస్తేగాని అసలు విషయాలు బయటకు పొక్కవని అప్పుడే హోటల్ నిర్వహణలో స్థానిక అధికార సిబ్బంది పనితీరుపై స్పష్టత ఏర్పడుతుంది.





1) అలీసాగర్‌లోని హరిత అతిథి గృహం దృశ్యం
2) కంకర తేలిన హరిత హోటల్‌కు వెళ్లే రహదారి
3) ఫొటోషూట్ కోసం ముస్తాబు చేసిన దృశ్యం

మండుతున్న ఎండలు

● తల్లడిల్లుతున్న పిల్లలు, వృద్ధులు



ఎండ నుంచి రక్షణకు రుమాల్ కట్టుకున్న వాహన దారులు

మద్నూర్, మే 5: భానుడు భగ భగ మండుతున్నాడు. ఉదయం 10 గంటలు దాటితుండగానే క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఈ ఎండకే తట్టుకోలేక పోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎండలను తలుచుకుంటే సూర్యుడి ప్రభావం ఏ విధంగా ఉంటుందోనని పల్లె వాసులు ఆందోళన చెందుతున్నారు. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 10 గంటల లోపు పనులు ముగించుకుని ప్రజలు ఇంటి దారి పడుతున్నారు. వేసవి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ, నిమ్మ కాయ, పుచ్చకాయ, దోస కాయ, కీరదోస తదితర ఆహార పదార్థాల వినియోగంపై దృష్టి సారించారు. ఎండాకాలంలో వాతావరణం వేడిగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులతో పాటు పలువురు ఆరోగ్య సమస్యలను గురవుతున్నారు. మండుతున్న ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

బీజేపీని ఓడించడమే సీపీఐ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బాస్

కామారెడ్డి టౌన్, మే 5: బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఐ(ఎం) పని చేస్తుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బాస్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశానికి ఒరిగిందేమి లేదని అన్నారు. నిరుద్యోగులకు కొలువులు, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంలో విఫలమైందని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. అనంతరం వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. కొత్త పరిశ్రమలను నెలకొల్పలేదని తెలిపారు. మత కలహాలు, కుల కొట్లాటలు తప్ప బీజేపీ చేసిందేమి లేదని అన్నారు. మోదీ చెబుతున్న సబ్‌కా వికాస్ ఎక్కడ కనిపించడం లేదని ఇప్పటికీ 5 లక్షల గ్రామాలకు తాగునీటి సరఫరాల లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోతీరాంనాయక్, ప్రభు, పోశెట్టి, మసూద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గాంధారి, మే 5: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆదివారం మండలంలోని గుర్జల్, బ్రహ్మణపల్లి,గాంధారిలలో కొనుగోలు కేంద్రాలను, గాంధారిలో పంచకృష్ణ ఆగ్రో ఇండస్ట్రీస్‌రైస్‌మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించికేంద్రాల్లో వసతులు, డబ్బు చెల్లింపుల పట్ల రైతులను ఆరాతీయగావసతులు బాగున్నాయని, కొనుగోలు జరిగిన మూడురోజులలోగా డబ్బులు మాఖాతాలో పడుతున్నా యని సంతోషం వ్యక్తం చేశారు.రాత్రి పొద్దుపోయాక కూడా ధాన్యం కొనుగోలు చేస్తు ట్యాగ్‌చేసిన మిల్లులకు తరలించాలని, మిల్లర్లు కూడా వెంటనే ధాన్యం అన్‌లోడ్ చేసుకుని తిరిగి లారీలను పంపేవిధంగా మానిటరింగ్ చేస్తు వెంట వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి 48 గంటలలోగా రైతులఖాతాలో డబ్బులు జమ చేసేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో పౌరసరాఫరాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి మృతి

పిట్లం, మే 5: మండలంలోని కంబాపూర్ గ్రామానికి చెందిన చాకలి అంబదాస్(30) ఇంటో ఉరేసుకొని మృతి చెందాడని ఎస్సై నీరేష్ తెలిపారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల కంబాపూర్ గ్రామానికి చెందిన చాకలి అంబదాస్ వృత్తి డ్రైవర్ తాగుడుకు బానిసై సంసారం సరిగా పట్టించుకొక పోవడంతో, అంబదాస్ భార్య రజిత 3 నెలల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి అంబదాస్ దగ్గరకు రాకపోవడంతో అంబదాస్ మనస్థాపం చెందిఈరోజు ఉదయం అందజా 5గంటల ప్రాంతంతో ఇంట్లో దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నిర్మానుష్యాంగా మారిన దోమకొండ



దోమకొండలో నిర్మానుష్యాంగా మారిన ప్రధాన మెయిన్ రోడ్డు

దోమకొండ, మే 5:ఎండలు దంచి కొడుతుండటంతో దోమకొండలో ఆదివారం రోడ్లన్ని నిర్మానుష్యాంగా మారాయి. ప్రజలు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వచ్చి పనులు చేసుకుంటున్నారు. అత్యవసర పనులుంటే తప్ప ప్రజలు బయటకు రావడంలేదు. ఎండకు బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. వ్యవసాయదారులు కుడా ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి పనులు చేసుకుంటున్నారు. ఎండలు దంచి కొడుతుండటంతో వ్యాపారస్తులు సైతం మధ్యాహ్నం సమయంలో దుకాణాలను మూసి ఉంచుతున్నారు. ప్రజలు ఎండకు బయటకు రాకపోవడంతో రోడ్లన్ని నిర్మానుష్యాంగా కనబడుతున్నాయి.

రక్తదానం చేయడం అభినందనీయం

కామారెడ్డిటౌన్,మే 5: తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేయడం అభినందనీయమని జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన రక్తదానశిబిరానికి ఆయన హాజరయ్యారు. రక్తదాతల సమూహం సంవత్సరకాలంలోని 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటుదక్కించుకోవడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసినందుకు డాక్టర్ బాలు, చింతలలక్ష్మీపతిలకు తలసేమియా సికిల్ సెల్ సొసైటి అవార్డులను అందించారు.ఈకార్యక్రమంలో అనిల్‌కు, జమీల్, షైమద్, వేదప్రకాష్, వెంకటరమణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్‌లో భానుడి భగభగ

● బోధన్ డివిజన్‌లోని బెల్లాల్‌లో 44.9 అత్యధిక ఉష్ణోగ్రత నమోదు
● పీహెచ్‌సీలకే పరిమితమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు
● బస్టాండ్, రైల్వే స్టేషన్‌లోనూ కనిపించని జనం



బోధన్‌లో నిర్మానుషంగా మారిన అంబేద్కర్ చౌరస్తా

బోధన్‌రూరల్,మే5: భానుడు భగభగమంటున్నాడు. మిట్ట మధ్యాహ్నం వేళ నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఉదయం పది తర్వాత బయటకు వెళ్తే ఎండకు దిమ్మ తిరిగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలవడంతో పాటు, సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాలను సైతం కోల్పోయే ప్రమాదం ఉంది. వేసవి వచ్చిందంటే ముందుగా అప్రమత్తవాల్సిన ఆరోగ్యశాఖ మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వైపు గతానికి మించిన ఉష్ణోగ్రత్తలు నమోదయ్యే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం సమ్మర్ అలర్ట్ ప్రకటించకపోవడం గమనార్హం. జిల్లాలో



జనం లేక వెలవెలబోతున్న రోడ్లు

ప్రస్తుతం 46.2డిగ్రీల వరకు ఉష్ణోగ్రత్తలు నమోదు అవుతున్నా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై మాత్రం అధికారులు ఆదేశాలు జారీ చేయకపోవడం, దానిపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం శోచనీయం.

ప్రతిఏటా మార్చి నెలాఖరుకల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమ్మర్ అలర్ట్ ప్రకటించి పలు రకాల చర్యలు చేపట్టేది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించకపోవడంతో పాటు ప్రతీ పీహెచ్‌సీల్లోనూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఆర్‌ఎల్, ఎన్‌ఎస్ ద్రావణాలను అందుబాటులో ఉంచేది. అంతేకాదు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను కూడా ఏర్పాటు చేసేవారు. గతంలో ప్రతీ పీహెచ్‌సీ పరిధిలోనూ మూడు నుంచి ఐదు వేల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు 7 నుంచి 10వేల వరకు ఆర్‌ఎల్, ఎన్‌ఎస్ ద్రావణాలను అధిక మొత్తంలో ఉండేలా చర్యలు తీసుకునేవారు. అయితే ఈ ఏడాది దాని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. పీహెచ్‌సీల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అందుబాటులో ఉంచాల్సిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ప్రస్తుతం పీహెచ్‌సీల్లోని గదులకే పరిమితమయ్యాయి. అవి కూడా కొన్ని పీహెచ్‌సీల్లో మాత్రమే సరిపడా ఉండటం గమనార్హం. చాలా పీహెచ్‌సీల్లో 500కు మించి ఓఆర్‌ఎస్‌లు లేవని సమాచారం. ఆర్‌ఎల్, ఎన్‌ఎస్‌ల పరిస్థితి కూడా అదే తీరున ఉండటం గమనార్హం. అయితే వేసవి కాలంలో ప్రతియేటా చేసే పని కదా అంటూఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా కొందరు పీహెచ్‌సీల వైద్యులు మాత్రం తాము అప్రమత్తంగానే ఉన్నామంటూ సమాధానమిస్తున్నారు.

● 46.2డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే జిల్లాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉండగా మార్చి నెలాఖరు నాటికే ఉష్ణోగ్రతలు 46.2డిగ్రీలు దాటిపోయాయి. ఇటీవల నమోదైన ఉష్ణోగ్రతల్లో ఆదివారం అత్యధికంగా బోధన్ డివిజన్‌లో 46.2ఉష్ణోగ్రత నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలో 46.2, బోధన్ మండలం బెల్లాల్‌లో 44.9 అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.బోధన్ డివిజన్ అయితే గతేడాదితో పోలిస్తే ఈయేడాది రెండు డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలుస్తోంది.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి



అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులోనే ఉన్నాయి. ఆర్‌ఎల్, ఎన్‌ఎస్ ద్రావణాలు ప్రతినెల ఇండెంట్ ఆధారంగా పంపిస్తున్నాం. ఎక్కడా వాటికి కొరత లేదు. ప్రజలు ఎండలు పెరుగుతున్న దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించాలి. అనారోగ్యం పాలైతే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విద్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, బోధన్

వేసవి దుక్కులతో.. ప్రయోజనాలెన్నో

● కలుపు బెడద నుంచి పంటకు రక్షణ ● చిరుజల్లులతో ఎంతో లాభం ● చీడపీడలు మటుమాయం

భీమ్‌గల్‌రూరల్, మే 5: మొన్నటి వరకు గ్రామాల్లో రైతులు వరిపంటను కోతల బిజీలో ఉన్నారు. గత నెల వరకు తమ పొలాల్లో ఉన్న వివిధ రకాల పంటల సాగుతో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం అంతర పంటలను తొలగించివేశారు. వేసవి దుక్కులు దున్నితే నేలలో క్రిములు, కీటకాలు చనిపోతాయని, భూములు సారవంతం కావడానికి వేసవి దుక్కులు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని రైతులు తమ పంట పొలాలను ఖరీఫ్‌కు సిద్ధం చేస్తున్నారు.

● లోతుగా దుక్కి దున్నడంతో ఎంతో లాభం

వేసవి దుక్కులు దున్నడం వలన కలుపు బెడద తగ్గించవచ్చు. దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటే కలుపు బాగా పెరిగి భూమిలోని పోషక పదార్థాలు గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. భూమి పొరల్లో దాగి వుండే కీటకాల గుడ్లు పంటలకు చీడపీడలు ఆశించడానికి కారణమయ్యే శిలీంద్రాలు నశిస్తాయి. మే, జూన్ లో కురిసే చిరుజల్లులు లోతుగా దుక్కులు దున్నడం వల్ల వడిన వాన చినుకు భూమిలోకి నేరుగా ఇంకిపోగా ఎదుగుతుంది. మొదలు భూమిలో కలిసి కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారి పంటలకు బలం చేకూరుతాయి భీమ్‌గల్ మండలంలోని 27 గ్రామ పంచాయితీల పరిధిలో 10 పై చిలుకు రైతులు ఉన్నారు. 30,657 ఎకరాల్లో వరి, పసుపు, మొక్కజొన్న, కంది, పెసర, కూరగాయలు తదితర పంటలు సాగుచేస్తారు.అయితే వేసవి దుక్కులతో భూమి వేడి చల్లారిన తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



భీమ్‌గల్‌లో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు



బీబీపూర్‌తండాలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, మే 5: మండలంలోని బీబీపూర్ గ్రామంలో జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ దేవాలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో గ్రామీణ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి ఎమ్మెల్యేగా మొదటి సారి వచ్చిన డా.భూపతిరెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్ బాదవత్ మోహన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో లావుడ్య సంజీవ్, జరపుల రవి, బాదవత్ బలరాం, రాంసింగ్, రవీందర్, నూర్‌సింగ్, సర్కల్, రాథోడ్ తారాసింగ్, పండరి, సర్దార్, బిక్యా, లింబ్యా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● నడిపల్లి కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచే అత్యధిక ఓట్లు వేసి మెజార్టీ వచ్చేల కార్యకర్తలు కృషి చేయాలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి కోరారు. ప్రచారంలో భాగంగా ఆయన ఆది వారం నడిపల్లి, మెంట్రాజ్‌పల్లి గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. 13వ తేదిన జరిగే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని ఓటు వేయాలని, అభ్యర్థించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధిచేయడానికి దోహదపడతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్,పొలసాని శ్రీనివాస్, షాంసన్, వాసుబాబు, ధర్మగౌడ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



డొంకేశ్వర్‌లో ఓటర్లకు పోల్ చిట్టిలు పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు

డొంకేశ్వర్, మే5: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో భాగంగా ఓటరు స్లిప్పుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌వో (బూత్ లెవెల్ ఆఫీసర్) ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఓటరు స్లిప్పుల అందజేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే డొంకేశ్వర్ మండ లంలోని 13గ్రామాల్లో దాదాపు పూర్తికావొచ్చింది. ఓటర్ల సమాచారంతో పాటు తమ పరిధిలో ఏదైనా ఎన్నికల ఉల్లంఘనలు జరిగిన రాజకీయం పార్టీలు ఓటర్లకు చేసిన ప్రలోభాలకు గురి చేసిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి వెబ్‌సైట్ 1950టోలో ఫ్రీ నెంబర్ కూడా ముద్రించింది. కాగా వీటిని గతంలో రాజకీయ పార్టీ ముద్రించి పోలింగ్‌కు ఒక్క రోజు ముందు కరపత్రాలతో ఓటర్లకు పంచేవి. అవి పూర్తిస్థాయిలో ఓటర్లకు చేరక ఇబ్బందుల ఏర్పడేవి. దీంతో ఈసారి ఓటర్లకు సులువుగా పోలింగ్ కేంద్రాలను చేరుకొని వినియోగించుకునేలా ఎన్నికల సంఘమే వీటిని ముద్రించి పంపిణీ చేస్తుంది.

కోనాపూర్‌లో అగ్నిప్రమాదం

● దగ్ధం ఏడులక్షల ఆస్తినష్టం



కోనాపూర్‌లో కాలిబూడిదవుతున్న డెయిరీ ఫాం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కమ్మర్‌పల్లి,మే5:కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన మంగి హరీష్ అనే వ్యక్తికి చెందిన డెయిరీ ఫామ్ శనివారం సాయంత్రం అనుకోని విధంగా అగ్నిప్రమాదానికి గురికాగా దానతయారి యంత్రాలతో పాటు దాన సంచులు, 15 వేల విలువ చేసే పశుగ్రాసం షెడ్డుపూర్తగా దగ్ధమయింది. విషయం తెలిసిన కోరుట్ల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరి మంటలను ఆర్పివేయడంతో అందులోని పశువులను చుట్టుపక్కలవారు విడిచి పెట్టడంతో బతికిబయటపడ్డాయి ఈ ప్రమాదంలో తనకు చెందిన విలువైన దానాతయారి యంత్రాలు, తయారీదాన, పశుగ్రాసంతో పాటు షెడ్డు కాలి బుడిదైనట్లు వీటి విలువ సుమారుగా ఏడులక్షల రూపాయలు ఉంటుందని బాదితుడు హరీష్ తెలిపాడు. తనను ప్రభుత్వ ఆదుకొని పరిహారం ఇప్పిచాలని విజ్ఞప్తి చేశాడు. అయితే షెడ్డు సమీపంలోని రైతు తన వరిపంట కోసిన పొలంలో కొయ్యాలకు నిప్పుపెట్టడంతో ఆ మంటలు డైయిరీ ఫామ్‌కు అంటుకున్నట్లు తెలిసింది, దీంతో సదరు రైతు కొంత ఎరిహారం అంజేయడానికి ముందుకు వచ్చినట్లు సమాచారం.

సాంపల్లిలో చౌడమ్మ ఆలయ వార్షికోత్సవాలు

● ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదవ సంఘ సభ్యులు



ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న యాదవ సంఘం మహిళలు

డిచ్‌పల్లి, మే 5: మండలంలోని సాంపల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ ఉత్సవాలను యాదవ సంఘం సభ్యులు ఘనంగా ఆదివారం రోజు నిర్వహించారు. గ్రామంలో యాదవ సంఘం కుటుంబాలు ఇంటకోభోనం తీసి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి సమర్పించారు. అనంతరం చౌడమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఒగ్గు కళాకారులు పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు, మహిళలు, గ్రామస్థులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం(బి)లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ధర్మారం(బి)లో 2002-03 సంవత్సరం విద్యార్థులు, గురువులు

డిచ్‌పల్లి, మే 5:మండలంలోని ధర్మారం(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 12ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఒకే చోట సమావేశమయ్యారు. చదువు చెప్పిన గురువులు విద్యార్థులు తమ పాఠశాల దశలో జరిగిన జాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితులంత తమ తమ కుటుంబాల వివరాలు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా చదువు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం కలిసిమెలిసి భోజనాలు చేశారు.

నిజామాబాద్ తరలివెళ్లిన బీజేపీ నాయకులు

నవీపేట,మే5: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిజామాబాద్ తరలివెళ్లారు. బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు మద్దతుగా జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభకు హోంమంత్రి అమిత్ షా హజరు కావడంతో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

● అమిత్ షా మీటింగ్ తరలిని డిచ్‌పల్లి బీజేపీ నాయకులు

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా, నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతు గా జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు డిచ్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షుడు యాదగిరి వెంకటరమణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు వాహనాల్లో తరలివెళ్లారు.

రైతు వేదికకు రక్షణ కరువు

రాజంపేట,మే 5:రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికకు రక్షణ కరవవుతుంది. రైతువేదికను పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారుతుంది. రైతులను సంఘటితం చేసి వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి వ్యవసాయంలో వచ్చే విప్లవాత్మక మార్పులపై అవగాహన కల్పించేందుకు గత ప్రభుత్వం క్లస్టర్ల వారిగా రైతు వేదికలు నిర్మించింది. సౌకర్య కల్పనలో సంబంధిత అధికారులు కాని ప్రజాప్రతి నిధులు గాని వాటిపై దృష్టిసారిం చకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతు న్నాయని రైతులు వాపోతున్నారు. రైతువేదికలోని అధికారుల కార్యాలయం పూర్తిగా దెబ్బతిందని నెలలు గడుస్తున్న దానిని సరిచేయడం లేదని పేర్కోంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన రక్షణ కల్పించడంతో పాటు సౌకర్యాలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.



రైతువేదికలో పూర్తిగా విరిగిపోయిన



ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తున్న గౌడ కులస్తులు

జై గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బోనాలు

పెద్ద కొడప్‌గల్, మే 5: మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఆదివారం జై గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా తమ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తామని, ఇందులో భాగంగానే ఈసారి కూడా ఎల్లమ్మకు బోనాలు సమర్పించామని తెలిపారు. ఎల్లమ్మ తమను చల్లగా చూడటంతో పాటు, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు.

గ్రామ దేవతలకు బోనాలు

బీబీపేట: బీబీపేట మండల కేంద్రంలో మున్నూరుకాపు కులస్తులు గ్రామ దేవతలకు, నాయకమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. 11 నెలల క్రితం పోచమ్మ, ముత్యాలమ్మ, నాయకమ్మ దేవాలయాలను నిర్మించి ఘనంగా పండుగ నిర్వహించామని, మళ్లీ 11 నెలల తర్వాత సుమారు పండుగను ఆదివారం నిర్వహించామని సంఘ సభ్యులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాకాల శ్రీహరిరావు

బీఆర్‌ఎస్, బీజేపీల హయాంలో రైతులకు అన్యాయం

ఎల్లారెడ్డి, మే 5: బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల హయాంలో రాష్ట్రంలో, కేంద్రంలో రైతులకు అన్యాయం జరిగిందని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో, బీజేపీ హయాంలో కేంద్రంలో దేశంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందలేక అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ, ఉచిత కరెంట్ సంక్షేమ పథకాలు అమలు చేసిందని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయలేదని రైతులు పండించిన పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేదని అందుకే జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రాంచందర్‌గౌడ్, మామిడి సీతారాములు, జైరోద్దీన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాగం గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో వ్యక్తి అదృశ్యం



టేకు మహేష్

బీర్కూర్, మే 5: మండల కేంద్రానికి చెందిన టేకు మహేష్(30) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బీర్కూర్‌కు చెందిన మహేష్ ఈనెల 2న కల్లు తాగి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా మహేష్ ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం గ్రామంలో స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి గాలించారు. అయినా అతడి ఆచూకీ లభించలేదు. ఆదివారం మహేష్ భార్య అనిత బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బావిని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

లింగంపేట, మే 5: మండల కేంద్రంతో పాటు లింగంపల్లి (ఖుర్దు) గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు గోపాల్‌జీ తివారి పరిశీలించాడు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధితో కొత్తగా 18-19 సంవత్సరాల వయస్సు గల కొత్త ఓటర్లు 53,678 మంది ఓటు హక్కును వినియోగించు కుంటున్నారని ఆయన తెలిపారు. ఈనెల 13న ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఓటు వేసేందుకు వసతులు కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని ఓటర్లకు సంబంధించిన ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేటలో పురాతన చరిత్ర కలిగిన నాగన్న భావిని పరిశీలించారు. ఈ బావిని కలెక్టర్ చొరవతో పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. బావి చరిత్రను కలెక్టర్ గోపాల్ జీ తివారికి వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితీష్ వి. పాటిల్, ఆర్డీవో ప్రభాకర్, నోడల్ అధికారి రఘునాథ్, తహసీల్దార్ నరేందర్, డీటీ రాజేష్‌తో పాటు అధికారులు ఉన్నారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- 248 గ్రాముల ఆల్ఫాజోలం, రూ.37వేల నగదు స్వాధీనం
- 14 రోజుల రిమాండ్‌కు తరలింపు



భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 5: కల్లులో కలిపే నిషేధిత అల్ఫాజోలం మత్తు పదార్థాన్ని రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్ మండల అబ్బాపూర్‌కు చెందిన నరేష్‌గౌడ్, గాంధారికి చెందిన దత్తాద్రిగౌడ్, మాక్లూర్‌కు చెందిన సంతోష్‌గౌడ్, సంగెం గ్రామానికి చెందిన మల్లికార్జున్‌గౌడ్ కారులో నిషేధిత మత్తుపదార్థం అల్ఫాజోలంను అక్రమ రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామం వద్ద ముగ్గురిని, బీటీఎస్ వద్ద మరొకరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 248 గ్రాముల అల్ఫాజోలంను, రూ.37,020లను, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ నలుగురికి 14 రోజుల రిమాండ్ విధించడం జరిగిందన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని సైతం త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయికుమార్, రాంచందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

మాచారెడ్డి, మే 5: కేంద్రం నుంచి నిధులు తెచ్చి గ్రామాలు, తండాలు అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం మాచారెడ్డి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ గెలుపు ఖాయమైందని, రెండో స్థానం కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడుతున్నాయని అన్నారు. గ్రామగ్రామానా బీజేపీకి స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అందరూ బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఈ సారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గెలువడం ఖాయమని కేంద్ర ప్రభుత్వ పథకాలే బీజేపీని మరోసారి అధికారంలోకి తెస్తాయని అన్నారు. కాకుల గుట్ట తండా మాజీ ఉప సర్పంచ్ నరేష్, వార్డు మెంబర్ హనుమాండ్లు, విజయరెడ్డి, వంశీరెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చంద్రంలు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింలు, రాజశేఖర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

మామ గెలుపు కోసం కోడలు ప్రచారం

మద్నూర్: మండలంలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం కోడలు వచనా పాటిల్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి బీబీ పాటిల్ చేసిన కృషిని వివరించారు. రాబోయే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పౌరహక్కుల ఉద్యమానికి తీరనిలోటు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

పెద్దబజార్, మే 5: ముప్వ నాగేశ్వర్‌రావు మరణం పౌరహక్కుల ఉద్యమానికి తీరనిలోటని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ముప్వనాగేశ్వర్‌రావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల ఉద్యమంలో ముప్వనాగేశ్వర్‌రావు క్రియాశీలకంగా పనిచేశారని అన్నారు. పోలీస్ రాజ్యం నిర్బంధం సవాళ్లతో కూడిన జిల్లా అధ్యక్ష బాధ్యతల్లో సుదీర్ఘ కాలం పనిచేయడం గొప్ప విషయమన్నారు. ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో గల లక్షల కోట్ల రూపాయల కనిజ సంపదపై కన్నేసిన మోదీ ప్రభుత్వం ఆదివాసులను చంపి వారిని అడవుల నుంచి తరిమివేసి కనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే కుట్ర చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల రాష్ట్ర నాయకులు ఆల్గోట్ రవీందర్, సురేష్, సీపీఐ ఎంఎల్ నాయకులు వనమాల కృష్ణ, శాంతన్, రామ్మోహన్‌రావు, భాస్కర్, సుధాకర్, సాయాగౌడ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమీనాపూర్‌లో మెగా శాఖాహార ర్యాలీ



అమీనాపూర్‌లో నిర్వహిస్తున్న మెగా శాఖహార ర్యాలీ

ఆర్మూర్‌రూరల్, మే 5: వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో ధ్యాన దంపతులు దశవ్వ మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం అహింసాయుత మహాకరుణ మెగా శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ప్రాణదాతగా పిరమిడ్ సేవా దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు హాజరై మాట్లాడుతూ.. ధ్యానం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరు నిత్యం ధ్యానం చేయడం వల్ల జీవితంలో ఎన్నో మార్పులు వస్తాయన్నారు. జగద్గురు బ్రహ్మర్షి పితమహా సుభాష్ పత్రీజీ ఆశయసాధనలో భాగంగా ధ్యాన ఆత్మజ్ఞాన కార్యక్రమాన్ని నిర్వ హించామన్నారు.ఈకార్యక్రమంలో పీఎస్ఎస్ఎం జిల్లాఅధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, శరత్ చంద్ర, దయానంద్, డాక్టర్ అమరవాజి శ్రీనివాస్,ప్రేమ్‌సాగర్,లలిత మోనాజీ, తదితరులు పాల్గొన్నారు.

మల్లారం అటవీప్రాంతంలో వ్యక్తి హత్య

- రూరల్ పోలీసులతో నేరడిగొండ పోలీసుల విచారణ
- పోలీసుల అదుపులో నిజామాబాద్ నగర వాసి
- మల్లారం అటవీప్రాంతంలో మృతదేహం కాల్చిన ఆనవాళ్లు

నిజామాబాద్ రూరల్, మే, 5: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తిని హతమార్చి గుర్తుపట్టకుండా కాల్చివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండకు చెందిన ఓవ్యక్తి ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. దాంతో ఆయన కుటుంబసభ్యులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మిస్సింగ్ వ్యక్తి సెల్‌ఫోన్ డేటాను పరిశీలించి చివరిసారిగా మాట్లాడిన మొబైల్ నెంబర్‌ను గుర్తించారు. ఆ నెంబర్ నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిదిగా గుర్తించి రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. రూరల్ పోలీసులతో కలిసి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా రూరల్ మండలం మల్లారం అటవీప్రాంతంలో వ్యక్తి దహనమైన దృశ్యాలను పోలీసులకు చూపించాడు.

పోలీసులు ఆ స్థలాన్ని పరిశీలించగా అక్కడ వ్యక్తిని కాల్చివేసిన ఆనవాళ్లు లభించాయి. ఆవ్యక్తిని ఎవరు కాల్చివేశారో వివరాలు తెలియలేదు.మృతుడికి నిజామాబాద్‌వాసికి ఆన్‌లైన్ యాప్ ద్వారా పరిచయం వున్నట్లు పోలీసులు నిర్ధారించారు.ఈఘటనపై రూరల్ పోలీసులతో కలసి నేరడిగొండ పోలీసులుదర్యాప్తు జరుపుతున్నారు.వివరాలు పూర్తిగా తెలియరాలేదు.

ఇండియా కూటమి అభ్యర్థికి సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మద్దతు

మాక్లూర్, మే5: రైతు వ్యతిరేక బీజేపీ పార్టీ అభ్యర్థులను ఓడించాలని ఇం డియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మండల ప్రధానకార్యదర్శి జైశెట్టి సాయిరెడ్డి అన్నా రు. ఆదివారం మండలంలో బోర్గం(కె) గ్రామంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగానికి, కార్పోరేట్ శక్తులకు అప్ప జెప్పాలని శయ శక్తుల కృషి చేసిందన్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గుర్తించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు మహేందర్

సిరికొండ, మే 5: సిరికొండ మండలంలోని సర్పల్లి తండా సమీపాన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేందర్ (28)అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ చెట్టుకు ఢీకొన్నాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సిరికొండ ఎస్సై రమేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన సంపంగిమహేందర్ వాల్గోట్ వడ్డెర కాలనీలోగల తన భార్య లతికతో ఉన్న వివాదాన్ని పరిష్కారం చేసుకోవడానికి సిరికొండ పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇటీవలే గల్ఫ్ దేశం నుంచి వచ్చిన మహేందర్ తన భార్యతో వివాదం జరిగింది. భార్య లతిక సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సమస్య పరిష్కారం చేసుకోడం కోసం మహేందర్ గౌరారం నుంచి సిరికొండ పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా సర్పల్లి తండా వద్ద గల మూలమలుపు వద్ద చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సైరమేష్ తెలిపారు. మృతుడు మహేందర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు.



లింగంపేటలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేటలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తా

- ఎమ్మెల్యే మదన్‌మోహన్

లింగంపేట, మే 5 : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌శెట్కార్‌ను గెలిపిస్తే లింగంపేట మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ నిర్మిస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన ఆదివారం లింగంపేట మండలంలోని మోతె, గాంధీనగర్, ముస్తాపూర్, ఒంటర్‌పల్లి, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి, శెట్పల్లిసంగారెడ్డి, పర్మల్ల, భవానిపేట, ముంబాజిపేట, కొండాపూర్, జల్దిపల్లి రాంపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగంపేటలో 50 ఎకరాల్లో ఐటీ పరిశ్రమను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కామారెడ్డి నుంచి బీదర్‌కు రైల్వేలైన్ ఏర్పాటు చేసి లింగంపేటలో స్టేషన్ నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, ఎల్లమయ్య, రఫీక్, రాజు, దశరథ్, ఫతియోద్దీన్, అబ్దుల్ నయీం, ఇబ్రహీం, భైరయ్యలతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

దోమకొండ, మే 5: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన దుంపల దేవరాజు (26) గత 15 రోజుల నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై గణేష్ ఆదివారం తెలిపారు. దేవరాజు గొర్రెల కాపరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. గత 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, అతని వదిన వినోద ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు

మద్నూర్, మే 5: ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ఈ సీజన్‌లో ప్రజలు ఎక్కువగా వడదెబ్బకు గురవుతుంటారు. దీనిని నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టింది. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. వృద్దులు, చిన్న పిల్లలు, గర్భిణీలు, తల్లులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకుని నీడ పట్టున చేరాలని, సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు వెళ్లాలని, సాధ్యమైనంత వరకు మంచినీరు ఎక్కువగా సేవించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీ లేఖ అన్నారు. వడదెబ్బకు గురికాకుండా మందులు జాగ్రత్తగా సూ చించి, వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

భిక్కనూరు, మే 5: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొయ్యల మోహన్‌గౌడ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బస్వాపూర్ గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన మోహన్‌గౌడ్ సౌమ్యుడిగా మంచిపేరును తెచ్చుకున్నారు. మోహన్‌గౌడ్ మృతిపట్ల మండల నాయకులు, గౌడసంఘం ప్రతినిధులు సంతాపం తెలిపారు.

సూర్య ప్రతాపానికి ఆమ్లెట్ సిద్ధం



ఎండలో గుడ్డు కొట్టి ఆమ్లెట్ వేస్తున్న శరణ్య

పెర్కిట్, మే 5: రోజు రోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శరణ్య అనే విద్యార్థిని వినూత్నంగా ఎండలో పెంక పెట్టి మంచినూనె ఉప్పుకరం కలిపి గుడ్డు కొట్టి పెంకపై వేయగా ఆమ్లెట్ తయారైంది. ఎండ తీవ్రతకు వడదెబ్బ గురయ్యే ప్రమాదం ఉందని సూచించడానికి ఎండలో ఈ ప్రయత్నం చేసినట్టు తెలిపింది. ప్రజలు ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని తెలిపింది.

మూడు ప్రచార రథాలు ఒకే చోట

భిక్కనూరు, మే 5: మండలకేంద్రంలో వారంతపు సంత కావడంతో ఆదివారం స్థానిక సినామా టాకీసు చౌరస్తాలో దాదాపు మూడు గంటల పాటు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రచార రథాలు ఒకేచోట పెట్టి పాటలను హోరెత్తించారు. మూడు పార్టీల ప్రచార రథాలు ఒకే చోట పక్కపక్కన పెట్టి పోటాపోటీగా ఆయా పార్టీలకు సంబంధించిన పాటలు పెట్టడంతో కొంత గందరగోళం ఏర్పడింది. మూడు ప్రచార రథాల్లో పాటలు రావడంతో ఏ పాట ఎందులో నుంచి వస్తుందో అర్థం కాక సంతకు వచ్చే ప్రజలు, వ్యాపారులు ఇదేమి ప్రచారమని విస్మయం వ్యక్తం చేశారు.

